15 JUL 2019

# యానాం న్యూస్

## పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్

● ఖాళీల భర్తీకి చర్యలు ● నేడు చివరి రోజు

**యానాం, జూలై 14:** స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ ద్వార్యా ఖాళీలు భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.షోలాన్ తెలిపారు. ప్రస్తుతం 2019-20 విద్యా సంవత్సరానికిగాను మొదటి సంవత్సరం కోర్సులలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ కుగాను ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈనెల 15వ తేదీలోగా అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో నేరుగా కళాశాల పనిదినాలు ఉదయం 10 నుంచి సాయంత్ర 5వరకు సంప్రదించాలన్నారు. వివరాలకు 0884-2321790కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

**యానాం, జూలై 14:** యానాం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సోమవారం సాయంత్రం 5.30కి పూర్వవిదార్థుల సమావేశం నిర్వహించామని ప్రిన్సిపాల్ జయరాజ్ డానియాల్ తెలిపారు.

## పుదుచ్చేరిలో ఫ్రెంచ్ నేషనల్ డే వేడుకలు

**యానాం, జూలై 14:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఫ్రెంచ్ నేషనల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వం, ఫ్రెంచ్ కౌన్సిలెట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఉన్న ఫ్రెంచ్ అమరవీరుల స్థూపంవద్ద నివాళులర్పించారు. ప్రభుత్వం తరుపున పుదుచ్చేరి కలెక్టర్ డాక్టర్ టి. అరుణ్, ఫ్రెంచ్ కౌన్సిల్ జనరల్ స్వార్డ్, ఫ్రెంచ్ సెనేట్ మెంబర్ శివాప్రతిభన్, ఫ్రెంచ్ కౌన్సిలర్స్ కనగా, బైచ్‌తోపాటు యానాం ఫ్రెంచ్ పౌరుల ప్రతినిధి. సాధనాల బాబు హాజరయ్యారు. అనంతరం స్థూపంవద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ వేడుకలలో భాగంగా మరో రెండు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఫ్రెంచ్ అమరవీరుల స్థూపంవద్ద నివాళులు అర్పిస్తున్న ఫ్రెంచ్ ప్రతినిధులు, సాధనాల బాబు

## సుబ్బరాజుకు ఈఈగా పదోన్నతి



దారా సుబ్బరాజును సత్కరిస్తున్న యానాం కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

**యానాం, జూలై 14:** యానాం ప్రజా పనులశాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దారా సుబ్బరాజుకు ఈఈగా పదోన్నతి లభించింది. పుదుచ్చేరిలోని షెడ్యూల్డుకులాల డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతిపై పుదుచ్చేరి వెళ్లనున్నారు. ఈసందర్భంగా యానాంలో పలువురు కాంట్రాక్టర్లు ఆయనను అభినందించారు. అనంతరం మాజేటి సత్యభాస్కర్, మల్లాడి శామ్యూల్ మాట్లాడుతూ విధి నిర్వహణలోను, ప్రజాభివృద్ధి పనుల నాణ్యత విషయంలో సుబ్బరాజు ఖచ్చితత్వాన్ని ప్రశసించారు. పలువురు కాంట్రాక్టర్లు దుశ్శాలువాతోను, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు వేగేశ్న భాస్కరరాజు, దవులూరి సత్తిబాబు, గొర్రెల వీరబాబు, పువ్వల దేవప్రసాద్ పాల్గొన్నారు.

## సబ్ జైల్ వెనుక పేరుకుపోతున్న మొక్కలు

**యానాం, జూలై 14:** యానాం సబ్-జైల్ వెనుకు పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఈవైపునే రీజెన్సీ కాలనీకి మార్గం ఉంది. రోడ్డుకు రెండు వైపులా మొక్కలు పెరిగిపోవడంతో ఇటీవల ప్రజా పన్నులశాఖ వారు వాటిని తొలగించారు. అయితే వెనుక వైపు ఉన్న మొక్కల ప్రాంతం, కింద ఉన్న డ్రైన్ మున్సిలిపాలిటీది కావడంతో వాటిని ఆ అధికారులు పట్టించుకోకుండా వదిలివేశారు. ఇటీవలే ఇద్దరు రిమాండ్ ఖైదీలు సబ్-జైల్ గోడదూకి పారిపోయారు. ఈ తుప్పలు తొలగించకపోతే ఈ విధమైన పరిస్థితులు మరిన్ని తలెత్తుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



యానాం సబ్‌జైల్ వెనుక అడవిని తలపిస్తున్న మొక్కలు

15 JUL 2019

## యానాంలో పాలిటెక్నిక్ కోర్సులకు తగ్గుతున్న ఆదరణ

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ఆరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 1512 సీట్లు ఉండగా ఈఏడాది 712 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉండగా ఇక్కడ మాత్రం పదోతరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఉంటున్నాయి. అయినా సీట్లు మాత్రం మిగిలిపోతుండడంతో విద్యాశాఖ ఆందోళన చెందుతోంది. దీంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల విద్యార్థులకు అవకాశం కల్పించాలంటూ ఆ శాఖమంత్రి కమలకణ్ణన్ ఆదివారం ఆదేశాలు జారీచేశారు. మంచి కోర్సులను అందిస్తున్నా విద్యార్థులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో తెలుసుకోవాలని, అవసరమైతే అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

## ప్రాంతాలవారీ రిజర్వేషన్లు ఎత్తివేయాలి

**యానాం, న్యూస్‌టుడే:** పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న వివిధ వృత్తివిద్యా, వైద్య కళాశాలల్లో ప్రాంతాలవారీ రిజర్వేషన్లను ఎత్తివేయాలని పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండు చేశాయి. ఈ మేరకు తల్లిదండ్రులు, విద్యార్థుల సంక్షేమసంఘం అధ్యక్షుడు ఏ బాలసుబ్రహ్మణియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వి.నారాయణసామికి ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. కారైకాల్‌కు 18 శాతం, మాహేకు 4, యానానికి 3 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో ప్రతిభావంతులైన పుదుచ్చేరి విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానంపై ప్రభుత్వం వెంటనే పునః సమీక్షించాలని కోరారు.

## పుదుచ్చేరిలో ఫ్రెంచ్ జాతీయ దినోత్సవం

**యానాం, న్యూస్‌టుడే:** పుదుచ్చేరి బీచ్‌రోడ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఫ్రెంచ్ జాతీయ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ టి.తరుణ్, ఫ్రెంచ్ కౌన్సిల్ జనరల్ కేథరిన్ సువార్డ్, సెనేట్ సభ్యుడు శివప్రతిబేన్, కనగ, యానాం ప్రతినిధి సాదనాల బాబు, సైనిక విభాగాల ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

# అక్షయగోల్డ్ బాధితుల గోడు వినేదెవరు?

- లక్షలాది రూపాయలు బాండ్లపేర డిపాజిట్లు వసూలు
- సావిత్రినగర్ తదితర తీరగ్రామాల్లో మత్స్యకార మహిళల నుంచి
- రూ.10లక్షల వరకు కట్టించుకున్న ప్రభుత్వ ఉద్యోగి నిర్వాకం
- సొమ్ములు అడిగినందుకు తిరిగి బాధితులపై కేసులు
- లబోదిబోమంటున్న బాధితులు



బాండ్లు ప్రదర్శిస్తున్న సావిత్రినగర్ అక్షయగోల్డ్ బాధితులు

యానాం: తీరప్రాంత గ్రామాల్లో నిరక్షరాస్యులైన మత్స్యకార మహిళలకు అధిక మొత్తాలను ఆశ చూపి డిపాజిట్ల పేర ఒక ప్రభుత్వ ఉద్యోగి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆనక మొహం చాటేయడమేకాక సొమ్ములను గూర్చి ప్రశ్నించినందుకు తిరిగి బాధితులుపై కేసులు పెట్టిన ఉదంత మిది.

ముఖ్యంగా తీరగ్రామాలైన యానాం నియోజకవర్గ పరిధిలోని సావిత్రినగర్, సరిహద్దున ఉన్న భైరవపాలెం, చినవలసల, పెదవలసల, గాడిమొగ తదతర ప్రాంతాల్లో లక్షలాది రూపాయలు వసూలు చేసి అవి తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులంతా లబోదిబో మంటున్నారు.

దీనికి సంబంధించిన వివరాలను సావిత్రినగర్‌కు చెందిన మత్స్యకారులు ఆదివారం తెలిపారు. యానాంలో మత్స్యశాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటున్న మసకపల్లి వెంకటేశ్వరరావు(బుజ్జి) 2008 సంవత్సరం నుంచి అగ్రిగోల్డ్ ఏజెంటుగా పనిచేసేవాడని ఆ విధంగా అధిక డబ్బులు ఆశ చూపి లక్షలాది రూపాయలను కట్టించుకున్నాడని తెలిపారు. అనంతరం 2012 సంవత్సరంనుంచి మళ్లీ ఎక్కువగా విశాఖపట్టణం కేంద్రంగా ఉండే అక్షయగోల్డ్ పథకం ద్వారా ఓన్ యువర్ ల్యాండ్ స్కీమ్ అగ్రిమెంట్‌ల సర్టిఫికెట్ల పేర లక్షలాదిరూపాయలను సేకరించారు.

ఆవిధంగా మసకపల్లి నారాయణమ్మ రూ.50వేలు, బొడ్డు ధనలక్ష్మీ నుంచి రూ.40వేలు, బొడ్డు రాంబాబు రూ.40వేలు, లోవరాజు రూ.40వేలు, సంగాడి నూకరత్నం రూ.30వేలు, మసకపల్లి అభినేష్ రూ.40వేలు, బొమ్మిడి కామేశ్వరరావు రూ.50వేలు, గంగాద్రి రూ.20వేలు, పెమ్మాడి నరసమ్మ రూ.24వేలు, ఓలేటి ఆదిలక్ష్మీ, మల్లాడి వెంకటేశ్వరరావు, సుజితా, రేఖాడి రాముడు తదితరుల నుంచి ఒక్కొక్కరు నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేశారు.

మల్లాడి వెంకాయమ్మ, బొడ్డు ధనలక్ష్మీ, మల్లాడి నందీశ్వరి, పెసింగి వరలక్ష్మీ, గవరమ్మ, లక్ష్మణస్వామి, పినపోతు సీత, బొడ్డు వాణి తదితరులు సుమారు 150 మందికి పైగా మహిళలనుంచి వసూలు చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బాధితులకు ఇచ్చిన బాండ్లు అన్ని జూలై, 2013లోనే విలువను కోల్పోయాయని అయినప్పటికి సంబంధిత ఏజెంటు ఇటీవలి వరకు డబ్బులు కట్టించుకున్నాడని రశీదులు మాత్రం ఇచ్చాడని బాధితులు తెలిపారు. అయితే శనివారం తామంతా కట్టించుకున్న డబ్బులు గురించి ప్రశ్నించామని దీంతో తిరిగి మాపై ఏజెంటు మసకపల్లి వెంకటేశ్వరరావు పోలీసు కేసులు పెట్టాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కొంతమంది బాండ్‌లు, డబ్బులు కట్టిన రశీదులును ఓలేటి గవరమ్మ, ముదే నాగరత్నం, కర్రి కామన్నలనుంచి తీసుకువెళ్లిపోయాడని మళ్లీ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం స్పందించాలి...**

కుమార్తెల వివాహాలకు పొదుపు... తామంతా కుమార్తెల వివాహాలకు, గృహనిర్మాణాలకు అక్షయ గోల్డ్ లో పొదుపు, డిపాజిట్‌ల రూపంలో లక్షలాదిరూపాయలు చెల్లించామని కాని ఇప్పటివరకు సుమారు ఆరు సంవత్సరాలు అవుతున్నప్పటికీ సొమ్ములు గూర్చి అడిగితే అదిగో ఇదిగోఅని అంటూ గడుపుకొచ్చాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి తమ సొమ్ములు తిరిగి ఇప్పించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అయితే అక్షయగోల్డ్ కంపెనీని ఎత్తివేసి రెండు సంవత్సరాలు అవుతుందని తెలిసింది.

# ఫ్రెంచి జాతీయ దినోత్సవం



పుదుచ్చేరిలోని ఫ్రెంచిజాతీయదినోత్సం, పాల్గొన్న యానాం ప్రతినిధి సాధనాల బాబు

యానాం: ఫ్రెంచి జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పుదుచ్చేరిలో ఫ్రెంచిపౌరుల ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధవీరుల సంస్మరణ స్థూపం వద్ద ఏర్పాటుచేసిన వివిధ ఫ్రెంచి స్వాతంత్ర్య ఉత్సవ కార్యక్రమాలకు యానాం నుంచి ఫ్రెంచి పౌరుల ప్రతినిధిగా సాధనాల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా అలనాటి ఫ్రెంచి సైనికులు, పౌరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి కలెక్టర్ టి.అరుణ్, ఫ్రెంచి కాన్సిల్ జనరల్ మేడమ్ స్కేట్టర్డ్, సెనేట్ మెంబర్ శివప్రతిబేన్, ఫ్రెంచి కాన్సిలర్స్ కనగ, బిచాట్, ఫ్రెంచి మిలటరీ, సివిల్, ఎయిర్‌ఫోర్స్, అసోసియేషన్ ల ప్రతినిధులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తగ్గిన అడ్మిషన్లు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈవిద్యాసంవత్సంలో అడ్మిషన్లు చాలా తగ్గిపోయాయని పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి కమలకన్నన్ ఆదివారం విలేకరుల వద్ద పేర్కొన్నారు. మొత్తం 1,512 సీట్లు ఉండగా కేవలం 721మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లుకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలికసదుపాయాల కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తోందని అయినప్పటికీ అడ్మిషన్లు తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సరాసరి ఒక్కో విద్యార్థికీ అతని విద్యా సౌకర్యార్థం కళాశాలల్లో రూ.1.10లక్షలను ప్రభుత్వం ఖర్చుచేస్తుందని తెలిపారు. మోతీలాల్‌నెహ్రూ కళాశాలలో179, ఉమెన్ పాలిటెక్నిక్‌లో 100, కారైకల్ పాలిటెక్నిక్‌లో 297, మాహే పాలిటెక్నిక్‌లో 37, యానాం పాలిటెక్నిక్‌లో 36, మరో ఉమెన్‌పాలిటెక్నిక్‌లో 142 సీట్లుకు దరఖాస్తులు వచ్చాయని అన్నారు. 50శాతం సీట్లు ఖాళీలుగా ఉన్నాయని అన్నారు.

## నేడు ఎస్‌ఆర్‌కే కాలేజీ పూర్వవిద్యార్థుల సమావేశం

యానాం: యానాంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయరాజ్ డేనియేల్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు కళాశాలలోని రెండవ అంతస్తులోని సెమినార్ హాలులో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అలుమిని అసోసియేషన్ కమిటీ అజెండా ప్రకారం ముందుగా కో-ఆర్డినేటర్ స్వాగతోపన్యాసం, కమిటీసభ్యులు ఉపోద్ఘాతాలు, ప్రిన్సిపాల్ ప్రసంగం, ఆఫీస్ బేరర్ల ఎన్నికలు, అనంతరం వారి స్వీయఅభిప్రాయాలను వివరిస్తారని తెలిపారు. అదేవిధంగా కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించనున్నారు.